www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 14 డిసెంబర్ 2023 5 తూర్పుగోదావరి



16న ఉపాధి శాఖ ఆధ్వర్యాన జాబ్ మేళా

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 16న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.హరిచంద్ర ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 09:30 గంటలకు శ్రీ ఐశ్వర్య ఫుడ్ ఇండస్ట్రీస్, ఐబిఎఫ్ఎల్ సంస్థ, పేటిఎం వంటి కంపెనీలు కస్టమర్ రిలేషన్షిప్ ఆఫీసర్, సూపర్వైజర్స్, లాజిస్టిక్ ఇన్చార్జి, ఒపెరేటర్స్, బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ సేల్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్ సమీపంలో, హెచ్పి పెట్రోల్ పంప్ వెనుక జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద ఈ మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8247437773 నెంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అంగన్వాడీల సమ్మెతో దద్దరిల్లిన కలెక్టరేట్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరింది. జిల్లావ్యాప్తంగా 3000 మంది అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు బొమ్మూరులోని కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తే తప్ప సమ్మె విరమించేది లేదని పెద్ద ఎత్తున నినదించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ బుచ్చయ్య చౌదరి, జనసేన రాజానగరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ బత్తుల బలరామకృష్ణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి ఇస్తానన్న హామీని ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ప్రశ్నించారు. సిఎం వైఎస్.జగన్ రాష్ట్రంలో ఉద్యోగులకు, కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రాబోయే టిడిపి, జనసేన ప్రభుత్వంలో అంగన్వాడీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం మరో మూడు నెలల్లో ఎన్నికలకు పోతున్న నేపథ్యంలో అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో మీన మీషాలు లెక్కిస్తోందని విమర్శించారు. గత ఎన్నికల్లో జగన్ను ముఖ్యమంత్రిని చేసింది అంగన్వాడీ స్కీం వర్కర్లు అన్న సంగతి మరువద్దని హితవు పలికారు. ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు, మధ్యతరగతి ప్రజలు అందరిపైన తీవ్ర భారాలు మోపి, కనీసం వారికిచ్చే వేతనాలు పెంచే విషయంలో కనీస కనికరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మేకపోతు గాంభీర్యం నటిస్తోందన్నారు. ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ, జిల్లా ట్రెజరర్ ఎం.వెంకటలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం రాజా, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఎ.జరీనా షరీఫ్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.సుందర్ బాబు, బి.రాజులోవ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్.మూర్తి, కర్రి రామకృష్ణ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాణిక్యంబ, కె.బేబిరాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.అన్నామణి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భాస్కర్, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు మాలతి, సుబ్బలక్ష్మి, బి.మార్త, దుర్గంబ, మార్త సుజాత, శారద, సునీత, పుష్ప, రామాలక్ష్మి, టిబి.లక్ష్మి పాల్గొన్నారు.

పెరవలి ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు మండలంలోని అన్ని క్లస్టర్ల పరిధిలో అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు బుధవారం రాజమహేంద్రవరం పెద్ద ఎత్తున తరలి వెళ్లి ధర్నాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గ, దుర్గా లక్ష్మి, రామలక్ష్మి, శ్రీదుర్గ, కన్యాకుమారి, విజయ, పుణ్యవతి, జ్యోతి, నాగలక్ష్మి, రాణి, కృష్ణవేణి, విశాలి, సత్తార్బీ పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ వర్కర్ల ధర్నా, మాట్లాడుతున్న అరుణ్



పెరవలిలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

20 నాటికి ఓటరు దరఖాస్తుల పరిష్కారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

యువ ఓటర్లు, ఓటు హక్కు లేనివారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయడంలో వివిధ తేదీల్లో ప్రత్యేక ప్రచారాలు చేపట్టామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్భరత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఛాంబర్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హేతుబద్దీకరణతో కూడిన ఓటరు గుర్తింపు నమోదు జిల్లాలో నిర్వహిస్తున్న స్వీప్ కార్యకలాపాల ద్వారా రాజకీయ పార్టీల భాగస్వామ్యం ద్వారా పెద్ద ఎత్తున నమోదు చేసినట్లు చెప్పారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించేలా రాజకీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాలను డిసెంబర్ 9 వరకు నిర్వహించామన్నారు. జిల్లాలో స్వీప్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో మార్పులు చేర్పులు గుర్తింపు తొలగింపునకు వివిధ దరఖాస్తులని స్వీకరించి, వాటిని పరిష్కారం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో జనాభా నిష్పత్తి ఎలక్టోరల్ నిష్పత్తి, లింగ నిష్పత్తి, సేవా ఓటరు తదితర వివరాలు ఆధారంగా ఓటరు జాబితా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో స్వీప్ కార్యకలాపాలకు నోడల్ అధికారులను నియమించామని, వాటి పరిశీలన ఈ నెల 26 నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. మార్పులు, చేర్పుల అనంతరం 5నన తుది జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.రామచంద్రరావు, ఎన్.రమేష్ శ్యామ్, ఎ.గోవింద్, ఎస్ఎస్.మూర్తి పాల్గొన్నారు.



ప్రతినిధులతో మాట్లాడుతున్న జెసి

గర్భస్థ లింగ నిర్ధారణ నేరం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

గర్భస్థ లింగ నిర్ధారణ నేరమనిజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి చెప్పారు. బుధవారం న్యాయ సేవాధికార సంస్థలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం-1994 గురించి ఆమె వివరించారు. గర్భంలోని బిడ్డ ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు, జన్యు పరమైన, ఇతర లోపాలను తెలుసుకునేందుకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహించాలని, లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ చేయడం నేరమని, అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న కేంద్రాలు మాత్రమే ఈ పరీక్షలు చేయాలని, ఈ చట్టంలో పేర్కొన్నట్టు వైద్య బృందం లేదా పరీక్షలు నిర్వహించిన వారు గర్భస్థ శిశువు లింగాన్ని తెలియజేయరాదన్నారు. ఈ చట్టాన్ని సరైన విధంగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు తరచుగా స్కానింగ్ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించాలని, స్కానింగ్ కేంద్రాల ఆవరణలో ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కలిగేలా పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సదస్సులో కొవ్వూరు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ జె.సంధ్య, సిడిపిఒ సిహెచ్వి.నరసమ్మ, జె.మహేష్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జ్ ప్రత్యూష కుమారి

రాష్ట్ర పోటీలకు కడియం విద్యార్థులు

ప్రజాశక్తి-కడియం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో డైట్ కాలేజీ బొమ్మూరులో జరిగిన కళా ఉత్సవ్-2023 పోటీల్లో కడియం విద్యార్థులు తమ సత్తాను చాటారు. జానపద నృత్యాలు బాలుర విభాగంలో జె.భాను ప్రకాష్, ఏకపాత్రాభినయం బాలికల విభాగంలో వై.పవిత్ర రాష్ట్రానికి ఎంపికయ్యారు. సంధ్యన, చాందినీదేవి, ప్రణవి, సూర్యగణేష్ ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఇన్ఛార్జి హెచ్ఎం ఎస్కె.రఫీయుద్దీన్, ఉపాధ్యాయులు విద్యార్థుల్ని అభినందించారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయులు సువర్ణవేణి, దుర్గ, శరత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులు

ఆశా వర్కర్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

కృష్ణంపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఆశా వర్కర్ శీలబోయిన రమాదేవి కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు రూ.10 వేల సాయం అందించారు. పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జి సువర్ణ రాజు, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గా ప్రసాద్, కంబాల సత్తిబాబు, చప్పటి శివ, జాజిమొగ్గల శ్రీనివాస్, కట్నం సురేష్, అడబాల మణికంఠ, సుందర్ సింగ్, మలే సతీష్, వివేక్ పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న నాయకులు



భూముల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ

పోడు భూములకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని మల్లవరంలో బుధవారం వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు 58 మందికి కొండ పోడు పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం వైసిపి జెండాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్ భవనం, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. గ్రామంలో ఎస్షి కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎంఎల్ఎ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండల వైసిపి కన్వీనర్ పాటి రాంబాబు, వైసిపి నాయకులు పైలా కల్యాణ్, గోకేడ చిట్టిబాబు, పల్లెల నాగు, సిరందాసు రాజు, కాపారపు రాజేష్, గోరుముత్య చిట్టిబాబు, అప్పికొండ రమణ, వెంకట రమణ, కర్రి శివరామకృష్ణ, అడబాల అబ్బులు, దంగేటి వెంకట రత్నం పాల్గొన్నారు.

సమస్యలపై ఫీల్డ్ అసిస్టెంట్స్ వినతి

ప్రజాశక్తి - సీతానగరం

తమ సమస్యలు పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు సుంకవల్లి పోశారావు ఆధ్వర్యంలో ఎంపిడిఒ రమేష్కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కోడెల్లి ప్రకాష్ మాట్లాడుతూ తమ సమస్యలపై 17 ఏళ్ల నుంచి సుదీర్ఘ పోరాటాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, పాలకులు మారుతున్నారు. అయినా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు తీరడం లేదని తెలిపారు. సమస్యల పరిష్కార దిశగా ఈ నెల 18న ప్రతి జిల్లాలో చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. 2024 జనవరి ఐదో తారీఖున చలో విజయవాడ కార్యక్రమం ద్వారా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు తూర్పు గోదావరి జిల్లా 18 మండలాల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్స్ అందరు పాల్గొని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోరం కృష్ణవేణి, బందిల రామారావు, కన్నాబత్తుల భాస్కరరావు, పి.రామకృష్ణ, కె.జ్యోతి, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని వీరలంకపల్లిలో పంచాయతీరాజ్, ఎంపిపి నిధులు రూ.15 లక్షలతో నూతన డ్రైనేజీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల సచివాలయాల కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, వరసాల ప్రసాద్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సిఎం వైఎస్.జగన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉప సర్పంచ్ అల్లాడ రాంబాబు, లంక వీరబాబు, తొట్ట సత్యనారాయణ దాకారపు ధర్మరాజు, కర్రి సూరారెడ్డి, కర్రి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

నాణ్యమైన బోధనతో ఉన్నత విద్య

ప్రజాశక్తి-కడియం

నాణ్యమైన బోధనతో ఉన్నతమైన విద్యతో విద్యార్థులు అన్ని విభాగాల్లోను రాణిస్తారని ఉప విద్యా శాఖాధికారి ఇవివిఎస్.నారాయణ అన్నారు. బుధవారం ఆయన కడియం ఎంఇఒ లజపతిరాయ్తో కలిసి దుళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నారాయణను స్కూల్ కమిటీ చైర్మన్ నూలు సోమేశ్, ఎంఇఒ మెమొంటో అందించి సాలువాతో సత్కరించారు. అనంతరం నారాయణ పాఠశాలలో పరిస్థితులను ఆరా తీశారు. మధ్యాహ్న భోజనాన్ని తిని పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సిలబస్, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఏ విధంగా వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వసతులు, టాబ్ల వినియోగం, పరీక్షలు నిర్వహిస్తున్న తీరును తెలుసుకున్నారు. ఫేజ్-2, నాడు-నేడు పనులను పరిశీలించి రికార్డులు తనిఖీలు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉపాధ్యాయులు మెరుగైన విద్య అందించి మంచి ఫలితాలు రాబట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పి.సంధ్యారాణి పాల్గొన్నారు.



పాదయాత్రలో మహిళలతో మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

రఘుదేవపురంలో జనసేన యాత్ర

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో జనసేన పార్టీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, ఆమె కుమార్తె వందనాంబిక బుధవారం పాదయాత్రలో పాల్గొన్నారు. దళితవాడలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి పెట్టలేదని ప్రభుత్వ యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన మహా పాదయాత్రలో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటికీ తిరుగుతూ, ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను వివరించారు.

చాగల్లులో రూ.50 లక్షల పంటనష్టం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలంలో సుమారు రూ.50 లక్షల మేర తుపాను పంటనష్టం ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.వేణుగోపాలకృష్ణ తెలిపారు. మండలంలో వరి 45 ఎకరాలు, మినుములు 50 ఎకరాలు, వేరుశనగ 20 ఎకరాలు, అరటి 100 ఎకరాలు నష్టపోయినట్టు తెలిపారు. దీని విలువ మొత్తం రూ.50 లక్షలు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం ఇన్పుట్ సబ్సిడీ రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు.

5వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యాన ధవళేశ్వరంలో బుధవారం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 5000 మంది ఈ అన్నదానంలో పాల్గొన్నారు. తొలుత చందన నాగేశ్వర్కు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. నాగేశ్వర్ మాట్లాడుతూ. అన్ని దానాల కంటే అన్నదానం మేలన్నారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా 5000 వేల మందికి అన్నదానం చేయడం సంతృప్తిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాధనాల శివ, తలారి ప్రసాద్, హమీద్ బాషా, సత్య వెంకటరమణ, పసుపులేటి దేవి, సరిత రాణి, పెన్నాడ లక్ష్మి పాల్గొన్నారు.

వీధులన్నీ శుభ్రంగా ఉంచాలి : కమిషనర్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తుపాను సందర్భంగా రోడ్లపై ఉన్న బురదను వెంటనే తొలగించి శుభ్రముగా ఉంచాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలో ఆయన తనిఖీలు చేపట్టారు. 39వ వార్డులో ఆయన పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాల మూలంగా రోడ్లపై పేరుకున్న బురద తొలగించినప్పటికీ కొన్నిచోట్ల బురద యింకా పూర్తిగా తొలగించలేదని గుర్తించారు. ఆ రోడ్లను వెంటనే శుభ్రం చేయాలన్నారు. ప్రతి చిన్న వీధులను క్షుణ్ణంగా పరిశీలించి ఎక్కడన్న బురద ఉంటే వెంటనే శుభ్రం చేయాలన్నారు. ఈ పర్యటనలో మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ ఇన్స్పెక్టరు రజని పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

లెక్చరర్లకు యునెస్కో శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ కళాశాల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ అకాడమీలో ప్రభుత్వ కళాశాల లెక్చరర్లకు బుధవారం యునెస్కో శిక్షణ ప్రారంభించారు. ఫ్యాకల్టీ డెవలప్మెంట్ అకాడమీలో ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారు. ప్రభుత్వ కళాశాల లెక్చరర్లకు వారి ద్వారా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను అందించడం కోసం ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎపి కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోల భాస్కర్ ప్రారంభించారు. అకాడమీలో డిసెంబర్ 17 వరకూ నిర్వహించే ఈ మాస్టర్ ట్రైనర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్లో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి 60 మంది పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ సి.కృష్ణ, అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ తులసి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ రిచా బన్సల్, శోబితా రావు, నూజిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



శిక్షణను ప్రారంభిస్తున్న అతిథులు

హిరోషిమా డేపై విద్యార్థులకు అవగాహన

హిరోషిమా నాగసాకి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యమం నిర్వహించారు. ఈ సందర్భగా విద్యార్థులకు చిత్రలేఖనం, వకత్వ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర ఆర్కె.మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. అణు ఇంధన వనరుల వినియోగం మీద పలు వైజ్ఞానిక అంశాలు వివరించారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి కోమల లక్ష్మి, అధ్యాపకులు డి.సంజీవ్ కుమార్, బి.గౌరీ నాయుడు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సంస్కరణాలయాలకు తమరు ఎన్నిసార్లు వెళ్లొచ్చారు సార్..!

పాడైన పంటల పరిశీలన

టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యాన నష్టపోయిన పంట చేలను పలు ప్రాంతాల్లో బుధవారరం పరిశీలించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పెరవలి మండలంలోని ముక్కామలలో బుధవారం తెలుగుదేశం పార్టీ బృందం మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ బృందంలో మాజీ ఎంఎల్సి ఆదిరెడ్డి అప్పారావు, నిడదవోలు నియోజకవర్గ అబ్జర్వర్ కటకంశెట్టి ప్రభాకర్, కొవ్వూరు నియోజకవర్గ అబ్జర్వర్ గొర్రెల శ్రీధర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ దెబ్బతిన్న వరి, అరటి, చెరకు, కూరగాయల పంటలను, తడిసిన ధాన్యం, పూల తోటలను పరిశీలించారు. సుమారు 2900 ఎకరాల్లో వివిధరకాల పంటల నష్టం రూ.20 కోట్ల మేర ఉంటుందన్నారు. రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులిదిండి నాగరాజు, అతికాల రామకృష్ణమ్మ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలోని రాగోలపల్లి, తుపాకులగూడెం, పోచవరం తదితర గ్రామాల్లో నీట మునిగిన పొగాకు వరి తదితర పంటలను టిడిపి నాయకులు పరిశీలించారు. అనంతరం ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ నష్టాలను పరిశీలించి తక్షణ సాయం అందించవలసిన ప్రభుత్వం రైతు కష్టాన్ని పట్టించుకోవడంలేదని జగన్ ప్రభుత్వానికి ఇవే చివరి రోజులని అన్నారు. చేతికొచ్చిన పంట నోటి దకా రాలేని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నా ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రైతులకు అన్ని విధాలా మేలు జరిగిందని రైతులను అన్ని విధాల ఆదుకునేది టిడిపి మాత్రమేనన్నారు. వారి వెంట మండల టిడిపి శాఖ అధ్యక్షుడర నామన పరమేశ్వరరావు, జొన్నలగడ్డ సుబ్బారాయుడు, కంఠమని రామకృష్ణ ప్రభాకర్, గొర్రెల శ్రీధర్, కొటారు వెంకట్రావు, కాకర్ల సత్యేంద్ర చలపతి, ప్రకాష్, అన్నమరెడ్డి సత్తిబాబు తదితరులు ఉన్నారు.

కొవ్వూరు రూరల్ కొవ్వూరు నియోజకవర్గంలో పంటనష్టాలను టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమని రామకృష్ణారావుతో కలసి ఆదిరెడ్డి అప్పారావు, పార్టీ నిడదవోలు నియోజకవర్గ అబ్జర్వర్ కటకంశెట్టి ప్రబాకర్, కొవ్వూరు నియోజకవర్గ అబ్జర్వర్ గొర్రెల శ్రీధర్ తదితరులు దెబ్బతిన్న, అరటి, పుగాకు పంటలను పరిశీలించారు. టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



కొవ్వూరులో..



తాళ్లపూడిలో..

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని గంటావారిగూడెంలో 16వ నెంబరు జాతీయ రహదారిలోని వంతెన వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై మతిస్థిమితం లేని వ్యక్తి నడిచి వెళుతూ ఉండగా విజయవాడ వెళుతున్న లారీ ఢీకొట్టి, అదుపుతప్పి జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌పై బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో పాదచారి అక్కడికక్కడే మృతి చెందగా లారీ డ్రైవర్, క్లీనర్లకు గాయాలు అయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని నల్లజర్ల పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న 15 మంది అరెస్టు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి గ్రామ పరిధిలో పేకాడుచున్న 15 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. వారి నుంచి రూ.35,060 నగదు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఉండ్రాజవరానికి చెందిన పెద్ది కామేశ్వరరావు మంగళవారం ఒక బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా నిందితుడికి ఈనెల 27వరకూ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ కె.రామారావు తెలిపారు. సంఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితునికి రిమాండ్ విధించేలా విధుల నిర్వర్తించిన ఎస్ఐని ఎస్‌పి అభినందించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ముగ్గళ్లలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి సారావ విక్రయిస్తున్న గోరుముచ్చు వీరాస్వామి అలియాస్ మల్లాంం అనే వ్యక్తిని అరెస్టు చేశామని కోరుకొండ ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ తెలిపారు. అతని నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన లారీలు

ఆరు లారీలు ధ్వంసం

ప్రజాశక్తి-గోపాలపురం

ఆరు లారీలు ఒక దానికొకటి ఢీకొన్న ఘటన గోపాలపురం శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం శివారు జాతీయ రహదారిపై కొయ్యలగూడెం వైపుగా వెళ్తే దారిలో వే బ్రిడ్జి వద్ద రెండు లారీలు ఒకదాని ఒకటి ఢీకొన్నాయి. ఇందులో ఒకలారీ అదుపుతప్పి లంకలోకి వెళ్లిపోయింది. అక్కడ నుంచి అదే రోడ్డులో 100 మీటర్ల పరిధిలో మరొక నాలుగు లారీలు ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లారీలు ముందు భాగాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ కె.సతీష్ కుమార్ కేసు నమోదు చేశారు. ల

వరకట్నం కేసులో జైలు శిక్ష

ప్రజాశక్తి - సీతానగరం

వరకట్నం కేసులో వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. ఇనుగంటివారిపేటకు చెందిన గారపాటి ప్రశాంతి, సత్యనారాయణ భార్యాభర్తలు. వరకట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని 2019లో ప్రశాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం దోషిగా తేలడంతో సత్యనారాయణకు ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ 7వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి బాబు తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

సిటిఆర్‌ఐ ప్లాటినం ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ (సిటిఆర్‌ఐ) ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భారత వ్యవసాయ పరిశోధన మండలికి చెందిన ప్రతిష్టాత్మక సిటిఆర్‌ఐ స్థాపించి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. 75 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో సిటిఆర్‌ఐ ఎన్నో మైలురాళ్లను అధిగమించింది. ఈ ఉత్సవాలను ముఖ్య అతిథిగా పాల్గొన్న భారత వ్యవసాయ పరిశోధన మండలి విత్తన వాణిజ్య పంటల అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డికె.యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1947లో చిన్న పరిశోధన కేంద్రంగా గుంటూరులో ప్రారంభమై క్రమంగా ఎదిగి దేశంలోనే పొగాకు పంటకు ఏకైక ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థగా అవతరించిందన్నారు. పంటల సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే నాణ్యమైన విత్తనాలు తప్పనిసరి అన్నారు. దీనితోపాటు మేలైన యాజమాన్య పద్ధతులు, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. ఇటీవల వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు వ్యవసాయ రంగంపై పెను ప్రభావాన్ని చూపుతున్నాయని దీనివల్ల రైతులకు అపార నష్టం సంభవిస్తుందన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను రూపొందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. పొగాకు పంట అధిక శ్రమతో కూడుకున్నదని, కూలీలకు శ్రమ తగ్గించడానికి యాంత్రీకరణను ప్రోత్సహించాలని ఆయన అన్నారు. పొగాకు పంట నుంచి ప్రత్యామ్నాయ ఉత్పత్తులు ప్రోత్సహించాలని, ఆ దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి రైతులకు అందించాలన్నారు. మన దేశం నుండి ఎగుమతయ్యే వ్యవసాయ ఉత్పత్తుల్లో పొగాకు పంటకు ప్రాధాన్యముందన్నారు. పొగాకు పంట నుంచి ప్రత్యామ్నాయ ఉత్పత్తులైన నూనె, కాన్సెర్ కారకాలను తగ్గించడానికి పరిశోధనలు చేయాలన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో మన దేశ నాణ్యమైన పొగాకుకు మంచి డిమాండ్ ఉందన్నారు. మన రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పొగాకు పంటలో అధిక దిగుబడి నిచ్చే నాణ్యమైన వంగడాల అభివృద్ధికి శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. అధిక ఆదాయాన్నిచ్చే పసుపు, మిరప లాంటి పంటల వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. పొగాకు, మిరప పంటల ఉప త్పత్తులకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. ఇటీవల సంభవించిన తుపాను వల్ల నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ యస్వంత్ కుమార్‌ను ఎంపీ భరత్‌రామ్ కోరారు. పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ పొగాకు విశిష్టమైన పంట అని, ప్రపంచ వాణిజ్య పటంలో భారతదేశానికి చోటు లభించేలా పొగాకు రైతులను నిలపడంలో కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ అద్భుతమైన కృషి చేసిందన్నారు. ఇక్కడి నేలలు వాతావరణం పొగాకు సాగుకు అత్యంత అనుకూలమైనవని, అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన పొగాకు వంగడాలను రూపొందించాలని శాస్త్రవేత్తలను కోరారు. విదేశీ మారక ద్రవ్యాన్ని పొందడానికి పొగాకు పంట ఉపయోగపడుతుందన్నారు.

ఈ ఉత్సవాల్లో రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు మాట్లాడారు. నన్నయ వర్సిటీ విసి ప్రొఫెసర్ కె.పద్మరాజు మాట్లాడారు. సిటిఆర్‌ఐ సుదీర్ఘ ప్రస్థానానికి చిహ్నంగా నిర్మించిన ప్రత్యేక పైలాన్‌ను అతిథులు ఆవిష్కరించారు. అనంతరం ఎంఎస్ స్వామినాథన్ అంతర్జాతీయ అతిథి గృహాన్ని ప్రారంభించారు. పొగాకు పంటకు సంబంధించి సంస్థ రూపొందించి విడుదల చేసిన వంగడాలతో కూడిన వివరాలు, మేలైన యాజమాన్య పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానము, విత్తనం దగ్గర నుంచి పంట కోత వరకు, కోతానంతర పరిజ్ఞానానికి సంబంధించి వివరాలతో కూడిన ప్రదర్శన రైతులను విశేషంగా ఆకట్టుకుంది. కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ కర్ణాటక, గుజరాత్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

నమూనా పరీక్ష పత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పెరవలి

మండల వనరుల కేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన రూపొందించిన పదో తరగతి నమూనా పరీక్షా పత్రాలను ఎంఇఒ-2 షేక్ సూర్జన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ సామాజిక స్పృహతో విద్యార్థుల సౌకర్యార్థం ఈ పరీక్షా పత్రాలను రూపొందించడం అభినందనీయం అన్నారు. జిల్లా కార్యదర్శి వి.వెంకట రమణ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఎక్కువ మార్కులు సాధించడానికి ఇవి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. అధ్యక్షుడు వి.సూర్య భాస్కర రెడ్డి, ప్రధాన కార్యదర్శి విఎన్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సౌకర్యార్థం తెలుగు ఆంగ్ల మాధ్యమ పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కె.మహేశ్వర రావు, ఇ.గణపతి, ఎన్.వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-కడియం

బొమ్మూరు రాఘవేంద్రనగర్‌లోని వాసంశెట్టి విజయలక్ష్మి, కడియపులంక ఎస్‌సి కాలనీకి చెందిన పల్లి సంపతరావు ఇళ్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో ఆ కుటుంబాలకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి, బాధ్యతా సేవా సంస్థ అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) బుధవారం సాయం అందించారు. బాధిత కుటుంబాలకు బాధ్యత సేవ సంస్థ ద్వారా నిత్యావసర వస్తువులు బియ్యం, దుప్పట్లు, చీరలు, వంట సామగ్రి, నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, నాగులపల్లి ఆశ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈలి గోపాలం, సోమన శ్రీను, బోడపాటి సత్యనారాయణ, మరడాపు శేఖర్, యెలిగొండ రవి, ఆరేటి వెంకట్రావు, కేతా నాగార్జున, చీకట్ల మాచరయ్య, విత్తనాల నాగమణి పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న వైసిపి నాయకులు బాబు

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ప్రజాశక్తి-పెద్దాపురం

అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా దళితవాడల్లో సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర నాయకులు తాడి బాబ్జి, ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ సెంటర్లోని అంబేద్కర్ భవనంలో బుధవారం జరిగిన దళితుల ఐక్యతా సభలో వారు మాట్లాడుతూ రాజకీయ నాయకులు దళితులను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవటం తప్ప దళితుల అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. దళిత కుటుంబాలు విద్యావకాశాలన్నింటినీ సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. స్థానిక పరిశ్రమల్లో దళితులకు ఉపాధి కల్పించాలన్నారు. స్థానిక నాయకులు గుర్రాల యాకోబు, ఆరేళ్ల వీరరాఘవ, జాలా దావీదు, పెద్దింటి మరిడియ్య, బేదంపూడి సత్తిబాబు, కేటి శ్రీను, తలారి ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట

ప్రజాశక్తి-కడియం

వైసిపి ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేసినట్టు మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి తాడాల విష్ణు చక్రవర్తి అన్నారు. బుధవారం గ్రామ సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి వెంకటేశ్వరరావుతో కలిసి అభివృద్ధి, సంక్షేమం పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ పొట్టిలంక సచివాలయ పరిధిలో ఇప్పటివరకు సుమారు రూ.23 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాస వీరభద్రరావు, వెంకటలక్ష్మి, సిద్దిన పుల్లయ్య, వీరబాబు, బుల్లి సత్యం, పంచాయతీ కార్యదర్శి బండారు తాతారావు పాల్గొన్నారు.



బీమా పరిహారం అందిస్తున్న సర్పంచ్, వైసిపి నాయకులు

బీమా పరిహారం సొమ్ము అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి

మండలంలోని చిడిపి గ్రామంలో ఇటీవల మరణించిన పూలపల్లి వీర్రాజు కుటుంబానికి వైఎస్ఆర్ బీమా పథకం నుంచి రూ.పది వేలను బుధవారం గ్రామ సర్పంచ్ తెగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు సచివాలయం సిబ్బంది ఉన్నారు.



వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ రాజా తదితరులు

పెందుర్తి వెంకటేష్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్‌ను బుధవారం పలువురు ఎంఎల్ఎలు, మాజీ ఎంఎల్ఎలు పరామర్శించారు. వెంకటేష్ తండ్రి డాక్టర్ రామచంద్రరావు ఇటీవల మరణించారు. దీంతో వెంకటేష్, ఆయన కుటుంబ సభ్యులను రాజానగరం టిడిపి ఇన్‌ఛార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి, రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, రాజానగరం జనసేన ఇన్‌ఛార్జి బత్తుల బలరామకృష్ణ, జగ్గంపేట మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు, రంపచోడవరం మాజీ ఎంఎల్ఎ చిన్నం బాబూ రమేష్, వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి గణేష్, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందం పరామర్శించిన వారిలో ఉన్నారు.



పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఎస్ఐ సతీష్ కుమార్

ఘనంగా ఎస్ఐ సతీష్ కుమార్ పుట్టినరోజు

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురం ఎస్ఐ కె.సతీష్ కుమార్ పుట్టినరోజు వేడుకలను సిబ్బంది బుధవారం నిర్వహించారు. బుధవారం ఎస్ఐ కె.సతీష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనతో కేక్ కటింగ్ చేయించారు. ఆయనకు కేక్ తినిపించారు. ఆయనకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తేలుతున్న పంటనష్టం

పజాశక్తి - యంత్రాంగం

తుపాన్ ప్రభావం మిగిల్చిన పంట నష్టం లెక్కలు తేలుతున్నాయి. గత రెండు రోజులుగా జిల్లాలోని వివిధ మండలాల్లో అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నారు. రైతులు, అధికారులు బృందంగా ఏర్పడి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో కలిసి పంట నష్టంను లెక్కిస్తున్నారు. **సామర్లకోట రూరల్** మండల పరిధిలో తుపాన్ ప్రభావంతో సుమారు 835 హెక్టార్ల పరిధిలో వరి పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి ఇమ్మిడిశెట్టి సత్య తెలపారు. క్షేత్ర స్థాయిలో నష్టం లెక్కింపు బృందాలు సర్వే చేస్తున్నాయని తెలిపారు. మండలంలోని ఉండూరులో నిర్వహించిన సర్వేలో 120 ఎకరాల్లో పంట నష్టంను జరిగినట్లు బృందం గుర్తించింది. రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా పంట నష్టం సర్వే నిర్వహిస్తున్నట్లు ఎఒ సత్య వివరించారు. **ఏలేశ్వరం**పూర్తి పారదర్శకతతో రైతన్నలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అంచనాలు రూపొందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిని బి.జ్యోతి తెలిపారు. మండలంలోని జె.అన్నవరం, మర్రివీడు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీలోగా పంట నష్టం రూపొందించి నష్టపోయిన రైతులు జాబితాను ఆయా ఆర్‌బికె కేంద్రాల్లో ప్రదర్శిస్తామని చెప్పారు. 18 నుంచి 22లోగా ఆ జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియచేయాలన్నారు. వరి పంట నష్టపోయిన రైతులకు హెక్టార్‌కు రూ.17 వేలు, అరటి పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు ప్రభుత్వం అందించనున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతోపాటు, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రౌతులపూడి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వివిధ ప్రాంతాల్లో 510 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారి ఈశ్వరరావు బుధవారం తెలిపారు. క్షేత్రస్థాయిలో పంట నష్టం గుర్తించడం జరుగుతుందని, నష్టపోయిన రైతులు ఆయా గ్రామ సచివాలయాలకు భూముల సంబంధించిన రికార్డులను అందజేయాలని ఆయన తెలిపారు. **జగ్గంపేట రూరల్** ఇటీవల సంభవించిన తుపాన్ ప్రభావంతో మండలంలో 18 గ్రామాల్లో వరి పంట నష్టం వాటిల్లింది. జగ్గంపేట మండల వ్యవసాయాధికారి శ్రీరామ్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు 2 వేల హెక్టర్లలో పంట నష్టం సంభవించిందన్నారు. క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 18లోగా పంట నష్టంపై సర్వే పూర్తికానుందని, గ్రామ స్థాయిలో సర్పంచ్, కార్యదర్శి, విఎఎ, విఆర్‌ఒలతో పంట నష్టం పరిశీలించేందుకు కమిటీ వేసినట్లు తెలిపారు.

వైసిపితోనే పేదలకు సంక్షేమ పాలన

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపితోనే ప్రజలకు సంక్షే మ పాలన సాధ్యమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామ పంచాయతీ వద్ద ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 2024లో జరిగే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరి బాబు, వైస్ ఎంపిపి కంటే ప్రభావతి, రాష్ట్ర కార్యదర్శి కంటే వీరరాఘవరావు, పంచాయతీ కార్యదర్శి కళ, నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, ఊబా జాన్ మోసెస్, గోపు మురళి పాల్గొన్నారు.

మల్లేపల్లిలో అన్నదానం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం మల్లేపల్లి, కొత్తూరు రామాలయాల వద్ద కార్తీకమాసం చివరి రోజున భారీ అన్నదాన కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా రామకుర్తి సత్యనారాయణ గురువు, చింతా అరుణ కుమార్ శర్మ వైష్ణవులు నాగేశ్వరావు అను, వెలిది సుబ్రహ్మణ్యం పార్వతి, మల్ల బత్తుల వీర చక్రం తులసమ్మ దంపతుల చేతుల మీదుగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడబాల సూరిబాబు, వెలిది వెంకటేశ్వరరావు, రావిపాటి నాగేశ్వరరావు, చింతపల్లి వీరభద్రరావు, గొల్లపల్లి విష్ణు, దిడ్డి బాబూరావు, ఉనమట్ల శ్రీను, వెలిది బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఒకచోట ఫుల్.. మరోచోట నిల్..

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

ప్రజాశక్తి-కడియం

నూతనంగా నిర్మించిన ఒక ప్రభుత్వ భవనం ఖాళీగా దర్శనమిస్తుండగా, మరోచోట ఒకే భవనంలో మూడు కార్యాలయాలు నిర్వహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దుళ్ల గ్రామంలోని గ్రామీణ పశువైద్యశాల శిథిలావస్థకు చేరడంతో తొలగించి, అదేచోట నాబార్డు నిధులు సుమారు రూ.27.5 లక్షలతో నూతన భవన నిర్మాణ పనులు 2018 సంవత్సరంలోనే మొదలుపెట్టారు. అప్పట్లోనే పశువైద్యశాలకు తాత్కాలికంగా స్థానిక బైపాస్ రోడ్ నందుగల పాతపంచాయితీ కార్యాలయ భవనాన్ని కేటాయించారు. అనంతర పరిణామాల్లో ఇదే భవనంలో సచివాలయం ఏర్పాటు చేసారు, రైతు భరోసా కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. మూడు కార్యాలయాల సిబ్బంది కార్యకలాపాలతో నిత్యం ఈ భవనం కిక్కిరిసి కనిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం, బిల్లుల పెండింగ్, నిధుల లేమి కారణంగా ఆలస్యమైనా, ఎట్టకేలకు నూతన గ్రామీణ పశువైద్యశాల భవనం పూర్తయ్యింది. అయినా ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది. ఆర్‌బికె భవనం కూడా పూర్తయ్యి, ప్రారంభం కోసం ఎదురుచూస్తుంది. ఈ భవనంలో రాత్రివేళల్లో మందుబాబులు మద్యం సేవించి, సేదతీరుతున్నారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. వివిధ పనులపై సచివాలయానికి వచ్చే ప్రజలు, ఆర్‌బికెకు వచ్చే రైతులు, పశువులను వైద్యశాలకు తీసుకురావాల్సిన పశు పోషకులు ఒకేచోటకు రావాల్సి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిర్మాణం పూర్తయ్యి, నిరుపయోగంగా ఉన్న గ్రామీణ పశువైద్యశాలను, అలాగే ఆర్బికే భవనాన్ని ప్రారంభించి, వినియోగంలోనికి తేవాలని పశు పోషకులు, ప్రజలు , రైతులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచని నూతన గ్రామీణ పశువైద్యశాల



మూడు కార్యాలయాలు నిర్వహిస్తున్న పాత భవనం

తీవ్ర ఇబ్బంది పడుతున్నాము

సచివాలయంలో పశువైద్యశాల కారణంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వైద్యం నిమిత్తం పశువులను తీసుకు వచ్చినప్పుడు ఖాళీలేక అవస్థలు పడుతున్నాం. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు మాపై చికాకు పడుతున్నారు. నూతన పశు వైద్యశాల పూర్తయ్యింది. దీనిని వెంటనే ప్రారంభించాలి.

-దూడల సత్యనారాయణ, పశుపోషకుడు, దుళ్ల.

కలెక్టర్ దృష్టికి తీసుకెళతాము

నూతన గ్రామీణ పశువైద్యశాల పూర్తయిన విషయాన్ని జిల్లా కలెక్టర్ దష్టికి తీసుకువెళతాము. వీలైనంత త్వరలో ప్రారంభించే ఏర్పాట్లు చేసి, రైతులకు వినియోగంలోనికి వచ్చేలా ప్రయత్నిస్తాము.

- డాక్టర్ సత్యగోవింద్, డిఎహెచ్ఒ రాజమహేంద్రవరం.